క్లుప్తంగా

ఆపద సమయంలో అండగా ఉంటాం!

ఎమ్మెల్సీ అరుణకుమార్



నందిగామటౌన్: ఆపద సమయంలో ప్రజలకు అండగా నిలవటమే కాకుండా ప్రజలను కాపాడేందుకు ఆపదకు ఎదురు నిలబడేందుకు సైతం వెనుకాడబోమని శాసనమండలి సభ్యుడు డాక్టర్ మొండితోక అరుణకుమార్ అన్నారు. పట్టణంలోని బాబూ జగ్జీవన్ రామ్ భవన్ ఎదురు రోడ్డు, పాత బస్టాండ్ సమీపంలో, వ్యవసాయ మార్కెట్ కమిటీ వెనుక ప్రాంతాలలో వరద నీటిలో చిక్కుకున్న ప్రాంతాలను గురువారం అర్ధరాత్రి ఆయన పరిశీలించారు. వరద ఉధృతి అధికమైందని గుర్తించిన అరుణకుమార్ తెల్లవారుజామున 3.30 గంటల ప్రాంతంలో ఎన్డీఆర్ఎఫ్ సిబ్బందిని పిలిపించి ఇళ్లలోని చిన్నారులు, వృద్ధులతో పాటు ప్రతి ఒక్కరినీ బయటకు తీసుకువచ్చి పునరావాస కేంద్రాలకు తరలించారు. పునరావాస కేంద్రాలలో అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.

ఎమ్మెల్యే కార్యాలయమే భోజనశాల..

వరద ముంపులో చిక్కుకున్న వారిని రక్షించేందుకు వచ్చిన ఎన్డీఆర్ఎఫ్ సిబ్బందికి ఎమ్మెల్యే మొండితోక జగన్మోహనరావు కార్యాలయం భోజనశాలగా మారింది. అర్ధరాత్రి వరకు శ్రమించి కంచల గ్రామంలో వరదలో చిక్కుకున్న వారిని రక్షించిన సిబ్బందికి ఎమ్మెల్సీ అరుణకుమార్ ఎమ్మెల్యే కార్యాలయంలో భోజన వసతి కల్పించారు.

యానాది కాలనీ వాసులకు సొంత ఖర్చుతో ఇళ్లు నిర్మించి ఇస్తా

ప్రభుత్వ విప్ ఉదయభాను



జగ్గయ్యపేట అర్బన్: గత కొన్ని రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు జగ్గయ్యపేట పట్టణంలోని పాలేటి నది పొంగి పట్టణంలోని పలు లోతట్టు ప్రాంతాలు జలమయమైనాయి. దీంతో స్థానిక 24 వ వార్డు యానాది కాలనీలోకి వరద నీరు రావడంతో పలువురు నిరాశ్రయులయ్యారు. స్పందించిన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను గురువారం రాత్రి బాధిత కుటుంబాలను సమీపంలో ఉన్న ఉర్దూ పాఠశాలలోకి తరలించి వసతి, భోజన సౌకర్యాలను కల్పించారు. శుక్రవారం ఉదయం యానాది కాలనీలో పర్యటించిన ఎమ్మెల్యే ఉదయభాను బాధితులతో మాట్లాడారు. ముంపు నుంచి శాశ్వత పరిష్కారం కోసం స్థానిక బలుసుపాడు రోడ్‌లో ఉన్న జగనన్న కాలనీలో బాధితులందరికీ స్థలాలు ఏర్పాటుచేసి, తానే సొంత ఖర్చుతో గృహాలు నిర్మించి ఇస్తానని హామీ ఇచ్చారు. అనంతరం బాధిత కుటుంబాలకు నిత్యావసర సరుకులు అందజేశారు.

సర్పంచ్ ఆధ్వర్యంలో కాజ్‌వేపై చెత్త తొలగింపు

పెనుగంచిప్రోలు: మునేరు శుక్రవారం మధ్యాహ్నానికి కొంత శాంతించింది. దీంతో కాజ్‌వేపై రాకపోకలు సిద్ధం చేసేందుకు సర్పంచ్ వేల్పుల పద్మకుమారి ఆధ్వర్యంలో జేసీబీలు ఏర్పాటు చేసి కంప, చెత్త తొలగించటంతో పాటు పంచాయతీ సిబ్బంది బురద లేకుండా ట్యాంకర్ల సాయంతో శుభ్రం చేస్తున్నారు.



ప్రత్యేక క్రేన్‌పై కూర్చుని వరద ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సీపీ రాణా



జగ్గయ్యపేట మండలం బూదవాడ రెడ్డినాయక్ తండా వద్ద కోతకు గురైన రహదారి



చెరువును తలపిస్తున్న మున్నేటి పరివాహక ప్రాంత పొలాలు



పెనుగంచిప్రోలు మండలం గుమ్మడిదూర్రు వద్ద వరదలకు దారుణంగా దెబ్బతిన్న రహదారి



మేకల కాపరిని, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలను అభినందిస్తున్న విప్ ఉదయభాను

శాంతించిన మునేరు



నందిగామ మండలం ఐతవరం సమీపంలో శుక్రవారం సాయంత్రానికి వరద తగ్గుముఖం పట్టడంతో తేరుకున్న జాతీయ రహదారి



నందిగామ పాత బస్టాండ్ ప్రాంతంలో ఇళ్లను చుట్టుముట్టిన వరద నీరు

- తగ్గుముఖం పడుతున్న వరద
- జాతీయ రహదారిపై విజయవాడ వైపు భారీ వాహనాలకు అనుమతి
- వరద ఉధృతిపై ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహిస్తున్న అధికారులు
- వరద నీరు పూర్తిగా తగ్గిన తర్వాతే రెండువైపులా యథావిధిగా రాకపోకలు

నందిగామ: మున్నేరు శాంతిస్తోంది. ఎగువ ప్రాంతంలో కురిసిన భారీ వర్షాలకు గత రెండు రోజులుగా ఉగ్ర రూపం దాల్చిన మున్నేరు శుక్రవారం సాయంత్రానికి క్రమేపీ తగ్గుతూ వస్తోంది. ప్రస్తుతం డివిజన్ పరిధిలోని వత్సవాయి మండలం లింగాల వద్ద కాజ్‌వేపై వరద నీరు ప్రవహిస్తోంది. దీని కారణంగా ఖమ్మం వెళ్లే రాష్ట్ర రహదారిపై రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. పెనుగంచిప్రోలు వద్ద కాజ్‌వేపై నుంచి గత మూడు రోజులుగా వరద నీరు ప్రవహిస్తోంది. ఈ నేపథ్యంలో ఆ మార్గంలో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. నందిగామ మండలం ఐతవరం వద్ద 65 వ నంబర్ జాతీయ రహదారిపై నిలిచిపోయిన వాహనాలను తెలంగాణ రాష్ట్రం మధిర మీదుగా మళ్లించారు.

నందిగామలో నీట మునిగిన కాలనీ

మున్నేటి వరద ప్రభావం అధికంగా ఉండడంతో పట్టణంలోని పాత బస్టాండ్ ప్రాంతంలో గల కాలనీలోకి సుమారు 7 అడుగుల మేర నీరు చేరుకుంది. ఈ నేపథ్యంలో గురువారం అర్ధరాత్రి ఆయా ప్రాంతాల్లోని ప్రజలను ఎన్డీఆర్ఎఫ్ బృందాలు సురక్షితంగా ఒడ్డుకు తీసుకువచ్చారు. శుక్రవారం కూడా ఆ ప్రాంతంలో సుమారు ఐదు అడుగుల మేర నీరు ప్రవహిస్తోంది.

కంచల గ్రామాన్ని చుట్టుముట్టిన వరద

నందిగామ మండలంలోని కంచల గ్రామాన్ని వరద చుట్టుముట్టింది. గ్రామానికి ఆనుకునే మున్నేరు ప్రవహిస్తూ ఉంటుంది. గ్రామంలో 1176 ఇళ్లు ఉన్నాయి. 2005 సెప్టెంబర్‌లో ఇదే తరహాలో మున్నేరుకు భారీగా వరద నీరు వచ్చింది. ఆ సమయంలో మూడు రోజులపాటు గ్రామం జలదిగ్బంధంలో ఉంది. 18 ఏళ్ల తర్వాత మళ్లీ ఇప్పుడు మున్నేరుకు అదే తరహాలో వరద వచ్చింది. ప్రస్తుతం రెండు రోజులుగా గ్రామాన్ని వరద నీరు చుట్టుముట్టాయి.

తెగిపోయిన కంచల రహదారి



నందిగామ నుంచి కంచల వెళ్లే రహదారి వరద నీటి కారణంగా శుక్రవారం సాయంత్రం పూర్తిగా తెగిపోయింది. ఆ మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. పలు విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి.

నీట మునిగిన పంట పొలాలు

పంట పొలాలు చెరువులను తలపిస్తున్నాయి. మున్నేటి వరద పంట పొలాల్లో నుంచి ప్రవహిస్తోంది. పరివాహక ప్రాంతంలో ఇప్పటికే నాట్లు పూర్తయిన వరి పొలాలు రెండు రోజులుగా వరద నీటిలోనే ఉన్నాయి. ముఖ్యంగా నందిగామ మండలం అంబారుపేట ప్రాంతంలో వరి నాట్లు పూర్తయిన పొలాలు వరద ముంపునకు గురయ్యాయి.

వరద ప్రాంతాన్ని పరిశీలించిన సీపీ రాణా

జాతీయ రహదారిపై ఐతవరం సమీపంలో ప్రవహిస్తున్న వరద నీటి ప్రాంతాన్ని శుక్రవారం సాయంత్రం విజయవాడ సీపీ టి.కె.రాణా, డీసీపీ అజిత, ఏసీపీ జనార్ధన్ నాయుడు పరిశీలించారు. ప్రత్యేక క్రేన్‌పై వరదనీటిలోనే ప్రయాణం చేస్తూ పరిస్థితులను స్థానిక పోలీసులను అడిగి తెలుసుకున్నారు. వరద పూర్తిగా తగ్గేంతవరకు జాతీయ రహదారిపై రాకపోకలు నిలిపివేసినట్లు తెలిపారు.

అర్ధరాత్రికి తగ్గుముఖం

గత రెండు రోజులుగా మున్నేటికి వరద నీరు భారీగా వచ్చి చేరుతోంది. ఈ నేపథ్యంలో శుక్రవారం సాయంత్రానికి వరద ప్రవాహం క్రమేపీ తగ్గింది. అధికారుల లెక్కల ప్రకారం.. శుక్రవారం ఉదయం 6 గంటల సమయానికి 1.74 లక్షల క్యూసెక్కుల నీరు దిగువకు వెళుతోంది. సాయంత్రం 6 గంటల సమయానికి 1.34 లక్షల క్యూసెక్కుల నీరు దిగువకు వెళుతోందని అధికారులు తెలిపారు. ఈ అర్ధరాత్రి సమయానికి మరింత తగ్గుముఖం పడుతుందన్నారు.

మునేటిలో చిక్కి...సురక్షితంగా బయటకు

నందిగామటౌన్: మండలంలోని పల్లగిరి వద్ద మునేటిలో చిక్కుకున్న బాధితులను శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్మోహనరావు ఆధ్వర్యంలో ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. శుక్రవారం తెల్లవారుజామున ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది ప్రత్యేక బోట్‌లలో బాధితుల వద్దకు వెళ్లి వారిని సురక్షితంగా బయటకు తీసుకువచ్చి, వారివారి స్వగృహాలకు తరలించారు. ప్రాణాలను పణంగా పెట్టి వరదలో చిక్కుకున్న వారిని రక్షించిన ఎన్డీఆర్ఎఫ్ సిబ్బందికి ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో రవీంద్ర, ఏఎంసీ చైర్మన్ మహ్మద్ మస్తాన్, వైఎస్సార్‌సీపీ నాయకులు గుడివాడ సాంబశివరావు, బాపట్ల సాంబయ్య, పట్నా శ్రీను, శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

స్వల్పంగా తగ్గిన వరద ఉధృతి

జగ్గయ్యపేట: మండలంలోని బూదవాడ, అన్నవరం, రెడ్డినాయక్‌తండా గ్రామాల్లో ప్రవహిస్తున్న పాలేరు శుక్రవారం స్వల్పంగా తగ్గుముఖం పట్టింది. శుక్రవారం యథావిధిగా ఆయా గ్రామాలకు రాకపోకలు సాగాయి. పాలేరు నది పరివాహక గ్రామాల్లో నివాసముంటున్న వారిని అధికారులు ఆయా గ్రామాల్లోని పునరావాస కేంద్రాలకు తరలించారు. ఆయా గ్రామాలలోని పంట పొలాలు నీట మునిగాయి.

పొంగుతున్న వాగులు

కంచికచర్ల: మున్నేటికి భారీగా వరదనీరు చేరటంతో మున్నేరుకు సమీపంలోని గండేపల్లి, పెండ్యాల, వేములపల్లి, శౌరీ అమరవరం గ్రామాల మధ్య ఉన్న వాగులు పొంగుతున్నాయి. వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. పొంగుతున్న వాగుల వద్ద పోలీస్, రెవెన్యూ సిబ్బందిని అప్రమత్తం చేశారు. ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులను తహసీల్దార్ పబ్బూరి శంకరబాబు, ఎంపీడీఓ కె.బాలశంకరరావు, ఎస్ఐలు పెండె సత్య వెంకట సుబ్రహ్మణ్యం, హైమావతి పరిశీలించారు.

లారీ డ్రైవర్లకు అల్పాహారం అందించిన టోల్‌వేస్ యాజమాన్యం

విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై గురువారం నుంచి రాకపోకలు నిలిపివేయటంతో గరికపాడు వద్ద భారీ వాహనాలను అధికారులు నిలిపివేశారు. అత్యవసర వాహనాలను కోదాడ, ఖమ్మం మీదుగా మళ్లించారు. చిల్లకల్లు టోల్‌వేస్ యాజమాన్యం లారీ డ్రైవర్‌లకు అల్పాహారం అందించారు.

వరద బాధితులకు అల్పాహారం, భోజన ఏర్పాట్లు

పెనుగంచిప్రోలు: మునేరు వరద ఉధృతికి స్థానిక బోసుపేట, ఎస్సీ కాలనీలో వరద చేరటంతో స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను ఆదేశాల మేరకు జెడ్పీటీసీ సభ్యురాలు వూట్ల నాగమణి ఆధ్వర్యంలో శుక్రవారం బాధితులకు అల్పాహారం, భోజన ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు వూట్ల నాగేశ్వరరావు, పూసల కార్పొరేషన్ డైరక్టర్ చేని కుమారి, ఏఎంసీ డైరక్టర్ తమ్మిశెట్టి సోమయ్య, మండల ట్రేడ్ యూనియన్ నాయకులు దేరంగుల శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు కత్తుల వెంకటేశ్వర్లు, రంగిశెట్టి దుర్గ, బొమ్మిరాణి, నలబోతు వెంకటేష్, నల్లపునేని వెంకట నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

మేకల కాపరిని రక్షించిన ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు

వెంగనాయకునిపాలెం(పెనుగంచిప్రోలు): గ్రామానికి చెందిన మేకల కాపరి చేతుల వెంకటేశ్వర్లు రెండు రోజుల క్రితం మేకలు మేపుకొనేందుకు మునేరు అవతలకు వెళ్లాడు. తిరిగి వచ్చే క్రమంలో మునేరు వరద ఉధృతి అంతకంతకు పెరగటంతో పాటు అవతల వాగు కూడా ఉధృతంగా ఉండటంతో అక్కడే ఉండిపోయాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సామినేని ఉదయభాను వెంకటేశ్వర్లుతో ఫోన్‌లో మాట్లాడి ధైర్యం చెప్పారు. శుక్రవారం ఉదయం ఎన్డీఆర్ఎఫ్, ఏపీ ఎస్డీఆర్ఎఫ్ బృందాలు రెండు బోట్లలో వెళ్లి వెంకటేశ్వర్లుతో పాటు 13 మేకలను క్షేమంగా ఒడ్డుకు చేర్చారు.

బాధిత కుటుంబాలకు న్యాయం చేస్తాం

ముంపు ప్రాంతాల్లో పర్యటించిన ప్రభుత్వవిప్ ఉదయభాను



వరద నీటిలో బాధిత కుటుంబాలతో మాట్లాడుతున్న ప్రభుత్వవిప్ ఉదయభాను

పెనుగంచిప్రోలు: రాష్ట్రంలో వరదల విషయంలో ప్రభుత్వం ఎంతో అప్రమత్తంగా ఉందని స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను అన్నారు. శుక్రవారం ఆయన గ్రామంలో వరద తీవ్రతకు నష్టపోయిన బాధిత కుటుంబాలను పరామర్శించి, వారికి ధైర్యం చెప్పారు. స్థానిక శ్రీతిరుపతమ్మవారి ఆలయం వద్ద బోసుపేటలో వరదలో నష్టపోయిన ప్రతి ఒక్క ఇంటిని సందర్శించి వారి బాగోగులు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనివిధంగా సుమారుగా 200 ఇళ్లల్లోకి వరద నీరు వచ్చిందన్నారు. నష్టపోయిన బాధితులకు బియ్యం, సరుకులు అందజేయటంతో పాటు ప్రభుత్వ పరంగా న్యాయం చేస్తామన్నారు. దేవస్థానం తరపున భోజనాల ఏర్పాటుతో పాటు సత్రాల్లో పునరావాస ఏర్పాట్లు చేశామన్నారు.

అనుక్షణం అప్రమత్తంగా అధికార యంత్రాంగం

వరద ఉధృతిని పరిశీలించిన ఎమ్మెల్యే జగన్మోహనరావు



ఐతవరం వద్ద జాతీయ రహదారిపై వరద ఉధృతిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జగన్మోహనరావు

నందిగామటౌన్: వరద ఉధృతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని, ప్రభుత్వ అధికార యంత్రాంగం మొత్తం అప్రమత్తంగా ఉందని, ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్మోహనరావు అన్నారు. మండలంలోని ఐతవరం వద్ద వరద ఉధృతిని గురువారం అర్ధరాత్రి, శుక్రవారం తెల్లవారుజామున ఆయన పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గురువారం రాత్రి వరద ఉధృతి అధికంగా ఉన్నప్పటికీ శుక్రవారం ఉదయానికి కొంత తగ్గుముఖం పట్టిందన్నారు. అయినప్పటికీ అత్యవసర పరిస్థితుల్లో ఉన్న వారిని, పరీక్షలకు వెళ్లే విద్యార్థులను క్రేన్‌ల ద్వారా అధికారులు రోడ్డు దాటించి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. ముఖ్యంగా రహదారిపై నిలిచిపోయిన ప్రయాణికులు, వాహనదారులకు అల్పాహారం, భోజన వసతి కల్పించామని తెలిపారు. వరద ఉధృతి తగ్గగానే జిల్లా ఉన్నతాధికారులతో చర్చించి జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలను అనుమతించనున్నట్లు తెలిపారు. అంతవరకు ప్రయాణికులు, వాహనదారులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్డీవో రవీంద్ర, ఏసీపీ జనార్ధన్ నాయుడు, వైఎస్సార్ సీపీ నాయకులు కొండా కృష్ణారెడ్డి, షేక్ కరిముల్లా, యాకుబ్ అలీ, తానూరి రాము, ఐలపోగు రాంబాబు, అధికారులు పాల్గొన్నారు.

డ్రైవర్లకు అల్పాహారాన్ని అందించిన ఉదయభాను



లారీ డ్రైవర్‌కు అల్పాహారాన్ని అందిస్తున్న ప్రభుత్వవిప్ ఉదయభాను

వత్సవాయి: గత మూడు రోజులుగా పడుతున్న వర్షాల కారణంగా విజయవాడ హైదరాబాద్ హైవేపై వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. నందిగామ సమీపంలో ఐతవరం గ్రామం వద్ద రహదారి పైకి వరదనీరు రావడంతో వాహనాల రాకపోకలను నిలిపివేశారు. దీంతో లారీలు, బస్సులు ఎక్కడివక్కడే నిలిచిపోయాయి. దీంతో స్పందించిన ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను జాతీయ రహదారిపై నిలిచిన వాహన డ్రైవర్లకు అల్పాహారం, వాటర్‌బాటిళ్లను అందజేశారు.



రహదారిపై నిలిచిపోయిన వాహనదారులకు అల్పాహారం అందిస్తున్న టోల్‌వేస్ సిబ్బంది



కంచికచర్ల మండలం కీసరలో ఉధృతంగా ప్రవహిస్తున్న మున్నేరు



కీసర సమీపంలో హైవేపై ప్రవహిస్తున్న వరదనీటి ఉధృతిని పరిశీలిస్తున్న సీఐ నాగేంద్రకుమార్



పెండ్యాల గ్రామంలో పొంగుతున్న వాగు



కంచికచర్ల మండలం కీసర గ్రామంలో మున్నేటి ఒడ్డున నీట మునిగిన ఇటుక బట్టీలు

మునేరు తువ్వ కాలువకు గండ్లు



తువ్వకాలువకు అనిగండ్లపాడు వద్ద పడిన పెద్ద పెద్ద గండ్లు



వరద తీవ్రతకు ట్రాన్స్‌ఫార్మర్, స్తంభాలు కొట్టుకు పోయి తీగలకు వేలాడుతున్న ఇనుప కడ్డీ

వరద నీటికి కొట్టుకుపోయిన విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, మోటార్లు

పెనుగంచిప్రోలు: మునేరు వరద ముంచెత్తటంతో తువ్వ కాలువకు పలు చోట్ల గండ్లు పడ్డాయి. వరద నీరు మొత్తం పొలాలపై ప్రవహించింది. దీంతో మండల పరిధిలోని పెనుగంచిప్రోలు, అనిగండ్లపాడు, గుమ్మడిదూర్రు గ్రామాల మునేరు ఆయకట్టున వరి నాట్లు, నారుమళ్లు పూర్తిగా కొట్టుకుపోయాయి. ఆయకట్టున సుమారుగా 300 ఎకరాల్లో పైగా నాట్లు వేశారు. వరద తీవ్రతకు పొలాల్లో నారు కొట్టుకు పోవటంతో పాటు ఇసుక, మట్టి మేట వేసిందని రైతులు అంటున్నారు. ఇప్పటికీ పొలాల్లో వరద ప్రవాహం కొనసాగుతూనే ఉంది. నాట్లు వేసిన రైతులు ఎకరానికి రూ.10 వేల వరకు నష్టపోయే ప్రమాదం ఉందని రైతులు అంటున్నారు.

విద్యుత్ కష్టాలు...

వరద ఉధృతికి పొలాల్లో ఉన్న పలు విద్యుత్ స్తంభాలతో పాటు మోటార్లు, బోర్లు, అక్కడక్కడా ట్రాన్స్‌ఫార్మర్లు కూడా కొట్టుకు పోయాయని రైతులు వాపోతున్నారు. దీంతో ఇప్పట్లో పొలాల మోటార్లకు కరెంట్ వచ్చే పరిస్థితి లేకుండా పోయింది.

10 చోట్ల వరకు గండ్లు....

రెండు రోజులుగా తువ్వ కాలువ పైనుంచి మునేరు వరద నీరు ప్రవహించింది. ఒక్కసారిగా గతంలో ఎన్నడూ లేని విధంగా 18 అడుగులు పైన మునేరు వరద రావటంతో గురువారం సాయంత్రం నుంచి అనిగండ్లపాడు, గుమ్మడిదూర్రు మధ్యలో తువ్వ కాలువకు 10 చోట్ల వరకు గండ్లు పడ్డాయి. వీటిలో 100 నుంచి 150 అడుగుల వరకు పెద్ద గండ్లు కూడా ఉన్నాయి.

వెంటనే మరమ్మతులు చేపడతాం

మునేరు తువ్వ కాలువకు పలు చోట్ల గండ్లు పడినట్లు మా దృష్టికి వచ్చింది. వరద ఉధృతి తగ్గిన వెంటనే పరిశీలించి అంచనాలు తయారు చేసి మరమ్మతులు చేపడతాం. దెబ్బతిన్న చోట పరిశీలించి తగు చర్యలు తీసుకుంటాం.

–ఎస్.బాలకృష్ణారావు, ఇరిగేషన్ డీఈ

రాత్రంతా రోడ్డుపైనే జాగారం



పేరకలపాడు క్రాస్ రోడ్డు వద్ద నిలిచిపోయిన వాహనాలు



కీసరలో రోడ్డుపైనే నిద్రిస్తున్న వాహనదారులు

- ఎక్కడికక్కడ వాహనాల నిలిపివేతతో ప్రజల అవస్థలు
- జాతీయ రహదారిపై ప్రవహించిన మునేరు వరదనీరు
- లారీ డ్రైవర్లకు అల్పాహారం అందించిన టోల్‌వేస్ యాజమాన్యం

కంచికచర్ల: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు కంచికచర్ల మండలం కీసర మునేరుకు రెండవ రోజు శుక్రవారం వరద నీరు చేరింది. దీంతో కీసర మునేరు అవతల ఒడ్డు సమీపంలో జాతీయ రహదారిపై వరదనీరు ప్రవహిస్తోంది. కళాశాలలకు, శుభకార్యాలకు వెళ్లే విద్యార్థులు, ప్రజలు, మహిళలు, ప్రయాణికులు, వాహనదారులు ఎక్కడికక్కడే ఉండిపోయారు. కాస్త ముందు వచ్చినా ఇంటికి చేరుకునేవారమని విద్యార్థులు, మహిళలు వాపోయారు. వాహనదారులు రోడ్డుపైనే వంటా వార్పు చేసుకున్నారు. వాహనాల రాకపోకలు నిలిచిపోవటంతో హైవే నిర్మానుష్యంగా మారింది. నందిగామ మండలం అంబారుపేటకు చెందిన 50 మంది మహిళలు ఇబ్రహీంపట్నంలో జరిగిన ఓ శుభకార్యానికి వెళ్లి తిరిగి ఇంటికి వెళ్లేందుకు బస్సు ఎక్కారు. రోడ్డుపై వరదనీరు ప్రవహిస్తుండటంతో ఆ బస్సును కీసరలోనే ఆపివేశారు. రాత్రంతా రోడ్డుపైనే జాగారం చేశామని ఆ మహిళలు తెలిపారు.

కళాశాల నుంచి ఇంటికి వెళుతూ ఇరుక్కుపోయా



కళాశాల వదలిన తర్వాత బైక్‌పై నందిగామలోని ఇంటికి బయలుదేరా. మునేరుకు వరదనీరు చేరటంతో ఐతవరం వద్ద జాతీయ రహదారిపై వరదనీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. ఎంతకూ వరద నీరు తగ్గకపోవటంతో అక్కడే ఉన్నా. కనీసం రోడ్డు పక్కన టీ తాగుదామన్నా హోటళ్లు లేవు. చాలా ఇబ్బందులు పడ్డాను. ఐదు నిమిషాలు ముందు బయలుదేరి ఉంటే ఇంటికి చేరిపోయేవాడిని.

– అశోకరెడ్డి, బీటెక్ ఫైనలియర్, విద్యార్థి, నందిగామ

డ్యూటీ దిగి ఇంటికి వెళుతుంటే...



గురువారం విధులు ముగించుకుని ఇంటికి వెళుతుండగా, ఐతవరం వద్ద జాతీయ రహదారిపై వరదనీరు ప్రవహిస్తోంది. అలాగే వెళ్లుంటే వరదకు కొట్టుకుపోయేవాడిని. పోలీసులు వెళ్లకుండా ఆపివేశారు. రాత్రంతా రోడ్డుపైనే ఉండాల్సి వచ్చింది.

– బాబు, డ్రైవర్, అంబారుపేట

కూలి పనికి పోయి ఇరుక్కుపోయాం



కూలి పనులకు ఇబ్రహీంపట్నం పోయాం. కూలి డబ్బులు తర్వాత ఇస్తామన్నారు. నందిగామ వెళదామని బస్సు ఎక్కాం. కాని రోడ్డుపై వరదనీరు పారుతోందని కీసరలో దింపేశారు. రాత్రి కావటంతో రోడ్డు పక్కన పాకలో ఉన్నాం. అన్నం తినలేదు. కనీసం మంచినీళ్లు కూడా లేవు. రాత్రంతా అలాగే ఉన్నాం. చాలా ఇబ్బందులు పడ్డాం.

– మంగ, నాయుడమ్మ, నందిగామ, పెనుగంచిప్రోలు